క్లుప్తంగా

శంభులింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



నందిగామ రూరల్:మాసశివరాత్రి సందర్భంగా నందిగామ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామివారిని పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, బిళ్వపుష్ప అర్చనాది పూజలను ఆలయ అర్చకుడు సాయిరామశర్మ శాస్త్రోక్తంగా చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాముకాటుతో మహిళ మృతి



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం వేమవరపు రూతుమ్మ(40)గ్రామంలో వ్యవసాయ కూలీపనులకు వెళ్లగా పాము కరిచింది. వెంటనే ఆటోలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి భర్త గతంలో చనిపోగా ఇద్దరు కుమారుల్లో ఒకరు నాలుగు నెలల కిందట మృతిచెందారంటూ బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది.

డ్రైనేజీ పనుల పరిశీలన



నందిగామటౌన్: నందిగామ పట్టణాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు, పల్లగిరి సమీపంలోని డంపింగ్ యార్డు, చెత్త రీసైక్లింగ్ యూనిట్ స్థలాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రీసైక్లింగ్ యూనిట్‌తో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఆమె వెంట ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

నందిగామటౌన్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లోవరాజు సూచించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేని వెంచర్లలో స్థలాలను కొనుగోలు చేసినవారు ఆయా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. క్రమబద్ధీకరణతో ఆయా ప్లాట్లకు శాశ్వత చట్టబద్ధ గుర్తింపు లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు సైతం సులభంగా లభిస్తాయన్నారు. చట్టబద్ధ గుర్తింపు ఉంటే ఆస్తి విలువ కూడా పెరుగుతుందన్నారు. క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు అమల్లోకి వచ్చిన 90రోజుల్లో దరఖాస్తు చేసుకున్నవారికి 14శాతం పెనాల్టీ చార్జీల్లో కూడా 50శాతం రాయితీ ఉంటుందన్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలి



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృషిచేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కమిటీ సభ్యులు చర్చించారు. ముఖ్యంగా మంచినీటి సమస్య పరిష్కారం, వివిధ విభాగాల వారీగా రిపేర్లు, ఆస్పత్రి జమాఖర్చుల వివరాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఆస్పత్రిలోని సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు, సూపరిండింటెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకలకు గణనాథులు ముస్తాబు

- గ్రామాల్లో చవితి పందిళ్ల ఏర్పాట్లలో భక్తులు
- విగ్రహాల కొనుగోళ్లలో కమిటీ సభ్యులు
- పెరిగిన గణపయ్య విగ్రహాల ధరలు

జగ్గయ్యపేట/వత్సవాయి: మరో ఐదురోజుల్లో ప్రారంభంకానున్న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామ కూడళ్లలో కొలువుదీరేందుకు రకరకాల ఆకృతులతో గణనాథులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయా కూడళ్లలో చవితి పందిళ్ల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో గణపతి విగ్రహాల తయారీకి చిల్లకల్లు ప్రసిద్ధి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు కళాకారులు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని కొన్ని నెలలుగా గణనాథ విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీరు తమ కళా నైపుణ్యంతో బాల వినాయకుడు, నాట్య వినాయకుడు, తమలపాకు వినాయకుడు, పంచముఖ వినాయకులు వంటి వందలాది విగ్రహాలను చూడచక్కగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ అవతార మూర్తుల రూపాలతో గణపతి విగ్రహాలు ప్రత్యేకాకర్షణగా ఉన్నాయి. విగ్రహ సైజు ఆధారంగా రూ.2వేల నుంచి రూ.50వేల వరకు ధర పలుకుతున్నాయి. అయితే విగ్రహాల పెరిగిన ధరలను చూసి నవరాత్రి వేడుకల నిర్వాహకులు బెంబేలెత్తుతున్నారు. కొందరు నిర్వాహకులు హైదరాబాద్ నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు.

ముమ్మర ఏర్పాట్లు..

వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జగ్గయ్యపేట, శాంతి నగర్ ప్రాంతాలలో విగ్రహాల కొనుగోళ్లు ఉపందుకున్నాయి. యువత, చిన్నారులు కమిటీలుగా ఏర్పడి సన్నాహాలు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న కమిటీ సభ్యులు



చవితి వేడుకలకు సిద్ధం చేసిన గణనాథుల విగ్రహాలు



జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన వినాయకుడి విగ్రహం

మంటపాలకు అనుమతులు తప్పనిసరి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఈనెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో మంటపాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరని ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సూచించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మంటపాల కమిటీ సభ్యులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలలో విగ్రహాల ఏర్పాటుకు పంచాయతీ అనుమతి ఉండాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని, సొంత స్థలాలలో ఏర్పాటు చేసుకునేందుకు స్థల యజమాని అనుమతి కూడా ఉండాలని సూచించారు. డీజేలు, మైకుల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సంబంధిత కమిటీ సభ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్

కూలీలకు అడ్డాగా ప్రభుత్వ భవనాలు

బండిపాలెం(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పలు రాష్ట్రాలకు కూలీలకు అడ్డాగా మారాయి. వివరాలలోకి వెళితే బండిపాలెంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు గ్రామానికి చేరుకున్నారు. కొందరు మేస్త్రీలు కమిషన్ ప్రాతిపదికన పలు రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువస్తుంటారు. వీరిని అద్దె గృహాల్లో ఉంచాలంటే అద్దెలు చెల్లించాల్సి వస్తుండటంతో ప్రభుత్వ భవనాలలోనే వసతి కల్పిస్తుండటం గమనార్హం. ముఖ్యంగా బండిపాలెం గ్రామంలోని బీసీ కమ్యూనిటీ హాల్, రైతు సేవా కేంద్రం, అమూల్ పాల కేంద్రం, తదితర ప్రభుత్వ భవనాలలో కూలీలకు ఆశ్రయమిచ్చారు. ప్రభుత్వ భవనాలలో కూలీలకు వసతి కల్పించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కావటంతో వారి జీవన నేపథ్యం తెలియక స్థానికులు ఒకింత భయాందోళన చెందుతున్నారు. ఈ తతంగమంతా మండల స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి స్థానికుల అభ్యంతరాల దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బండిపాలెం రైతుభరోసా కేంద్రంలో బస చేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈవో

నందిగామ రూరల్:ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యాప్‌లు, నమోదు విధానాలపై ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు సూచించారు. పట్టణంలోని పల్లోట్టి గ్లోబల్ పాఠశాలలో నందిగామ డివిజన్ మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన, హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మనబడి–మన భవిష్యత్ పనుల పురోగతి, అపార్ ఐడీ, బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, బోధన–అభ్యాస పద్ధతులు, ఇన్‌స్పైర్ అవార్డుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో నందిగామ డీవైఈవో సాంబశివరావు, డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యూవీ సుబ్బారావు

ప్రణాళికాబద్ధంగా చదివితే చక్కటి ఫలితాలు

కంచికచర్ల: ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా చక్కటి ఫలితాలను సాధించవచ్చని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో రామోహ్మనరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధనకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితే జీవితంలో అత్యున్నత శిఖరాలను సులభంగా చేరుకుంటారన్నారు. తమ కళాశాలలో అందించే కోర్సులు, అందుబాటులో ఉన్న వసతులు, జాబ్ ఓరియంటేషన్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతుల వివరాలను వివరించారు. కళాశాలలోని ఐటీ, డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా, క్రిప్టో ల్యాబ్స్, అడ్వాన్స్ ల్యాబ్స్ ద్వారా ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకుని ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, క్లబ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. శ్రీదేవి, సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి దొడ్డా పవన్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమ్రితసాయి కళాశాల కరస్పాండెంట్ రామ్మోహనరావు



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



రావిరాల వద్ద నీట మునిగిన పంట పొలాలు



రావిరాల వద్ద తగ్గుముఖం పట్టిన కృష్ణమ్మ ఉధృతి

తగ్గుముఖం పట్టిన కృష్ణమ్మ ఉధృతి

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద గురువారం కొంత తగ్గుముఖం పట్టింది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 13 గేట్ల ద్వారా దిగువకు నాలుగు లక్షల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయడంతో పరివాహ గ్రామాలు ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాలలో కృష్ణమ్మ ఉధృతి క్రమంగా తగ్గుతోంది. రావిరాల గ్రామంలోని 100ల ఎకరాలు వరద ముంపుకు గురయ్యాయి. మరో నాలుగు రోజుల పాటు ఇదే క్రమంలో ప్రవాహం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సరిహద్దు ప్రాంత మహిళలకు 'స్త్రీశక్తి' వర్తింపజేయాలి

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: స్త్రీశక్తి పథకాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మహిళలకు కూడా వర్తింపజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు తన్నీరు నాగేశ్వరరావు గురువారం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఆర్టీసీ ఆర్ఎం ఎం.వై.దానంను కలిసి వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో ఉన్న నియోజకవర్గాల ఆడపడుచులకు అందడం లేదని ఆర్ఎంకు వివరించారు.

ఆర్టీసీ అధికారులు గమనించాలి...

రాష్ట్రంలో జగ్గయ్యపేట నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసుల్లో స్త్రీశక్తి పథకం అమలుగాక మహిళలు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ పరిస్థితి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్నటువంటి రాష్ట్రంలోని సుమారు 50 నియోజకవర్గాల్లో ఉందంటూ సమస్య తీవ్రతను తెలియజేశారు. జగ్గయ్యపేట బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులు తెలంగాణ రాష్ట్రం కోదాడ, వైరా, హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోకి ప్రయాణం చేసిన పుడు ఆంధ్ర సరిహద్దు గ్రామీణ ప్రాంతాల వరకు మహిళలకు ఈ పథకం కింద ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి తెలంగాణ సరిహద్దు 10 నుంచి 15 కి.మీ దూరంలో ఉందన్న విషయాన్ని ఆర్టీసీ అధికారులు గమనించాలని కోరారు. జగ్గయ్యపేట బస్టాండ్ నుంచి తెలంగాణ రాష్ట్ర వైరా వరకు వెళుతున్న ఆర్టీసీ బసు జగ్గయ్యపేట మండలం గరికపాడు వరకు, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతిర్యాల వెళ్తున్న బస్సు జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామాల సరిహద్దు ప్రాంతాల మహిళలకు స్త్రీశక్తి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం మాదిరే ఏపీలోని రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా అమలుచేస్తున్న విధివిధానాలపై పునరాలోచన చేసి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల మహిళలకు అంతర్‌రాష్ట్ర సర్వీసుల్లోనూ ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి..

జగ్గయ్యపేట పట్టణంలో జాతీయ రహదారిపై నిర్మించిన హైవే బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో ప్రయాణికులు హైవేలోనే బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన్నీరు గుర్తుచేశారు. ఎండ వానల్లోనే లగేజీలతో ఇబ్బంది పడుతున్నారని, హైవేలో రాత్రిపూట మహిళలకు తగిన భద్రత లేకపోవడంతో భయాందోళనలకు గురవుతున్నారన్నారు. హైవే బస్టాండ్ మీదుగా బస్సులు రాకపోకలు సాగిస్తే ప్రయాణికులు మేలు చేకూరుతుందని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని ఆర్ఎం దానంను కోరారు. ఆర్ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, పార్టీ పేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శివరాత్రి పృథ్వీరాజ్, యూత్ నాయకుడు షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.



ఆర్టీసీ ఆర్ఎం ఎంవై.దానంకు వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నేతలు

దివ్యాంగులను అవమానిస్తున్న కూటమి ప్రభుత్వం

జగ్గయ్యపేటఅర్బన్‌:దివ్యాంగులను సర్టిఫికెట్ల పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం వారిని అవమానిస్తోందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ విమర్శించారు. జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం దివ్యాంగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. అక్కడ దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ వైద్యులు సకాలంలో వైద్యపరీక్షలు చేయకపోతుండటంతో దివ్యాంగులు ఇబ్బందిపడుతున్నారన్నారు. అనంతరం దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచారవిభాగం కార్యదర్శి చౌడవరపు జగదీష్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి పోనకాల ప్రసాద్, నాయకులు గోగుల వెంకయ్య, డేరంగుల తిరుపతిరావు, కనపర్తి సత్యం పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగునకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో రాజు ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కారాయలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. మురుగునీరు పారుదలయ్యేలా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేలా మలాథీన్, ఎబేట్ మందులను పిచికారీ చేయించాలని సూచించారు.

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న బండి మల్లికార్జునరావు, మార్త శ్రీనివాసరావు, గుదే అక్కారావు, కోటిబాబు, వేల్పుల రమేష్, తంగెళ్లమూడి రామారావు, మంగలపూడి సన్నీ తదితరులు

కంచికచర్ల: ఎన్నికల హామీలను అమలుచేయకుండా కూటమి ప్రభుత్వానికి ప్రజలను నిలువునా మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ కంచికచర్ల మండల పార్టీ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు విమర్శించారు. మండలంలోని గనిఆత్కూరు, గొట్టుముక్కల గ్రామాల్లో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతోందన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వం భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఇది దద్దమ్మ ప్రభుత్వం...

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఇచ్చిన హామీలను అమలుచేయలేని దద్దమ్మ ప్రభుత్వం నడిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి నేటికీ ఆయా హామీలను అమలుచేయకపోవడం శోచనీయమన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కూటమి చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆదేశాల మేరకు గనిఆత్కూరు గ్రామ పార్టీ కన్వీనర్‌గా సయ్యద్ జిలాని, గొట్టుముక్కల కన్వీనర్‌గా గుదే అక్కారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, వేల్పుల రమేష్, మంగలపూడి సన్నీ, కోటిబాబు, వేమవరపు పురుషోత్తం, ముప్పాళ్ల శివాజీ, సయ్యద్ జానీబాషా, తంగెళ్లమూడి రామారావు, గుదే సాంబశివరావు(శివయ్య), షేక్ అబ్దుల్ ఖాదర్, సయ్యద్ ఇబ్రహీం, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, రాజేంద్ర, షేక్ జాని, సయ్యద్ బాజీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

జగ్గయ్యపేటఅర్బన్: శ్రావణమాస గురువారం సందర్భంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చెరువుబజారులో వేంచేసియున్న గ్రామదేవత శ్రీముత్యాలమ్మను శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థాన ప్రైవేటు ఇంప్రూవ్‌మెంట్ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సీఐఐ ఏపీ ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డేను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార, పారిశ్రామిక రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆ దిశగా అడుగులు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయని చెప్పారు. విద్యార్థులు వ్యాపారంలో ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ప్రాముఖ్యతనివ్వాలన్నారు. మారుతున్న మార్కెట్ ధోరణులు, స్టార్టప్స్, మార్కెట్ సవాళ్లు తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన పరిచారు. ప్రధానంగా సృజనాత్మకతతో కూడిన అంశాలను ఆయన వివరిస్తూ ఆ దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, ఏక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయాలంటూ ఆందోళన

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ఏపీ–తెలంగాణ మధ్య నడిచే ఆర్టీసీ బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం షేర్‌మహ్మద్‌పేట వద్ద ఆర్టీసీ బస్సులను నిలిపివేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఐద్వా నాయకురాలు సోమోజు నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిందన్నారు. అయితే జగ్గయ్యపేట–కోదాడ మధ్య నడిచే బస్సులకు పథకాన్ని అమలు చేయకపోతుండంతో మహిళలు ఇబ్బందిపడుతున్నారన్నారు. రాష్ట్ర పరిధిలో కూడా పథకాన్ని అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇతర రాష్ట్రాల్లోకి తిరిగే బస్సులకు రాష్ట్ర సరిహద్దు వరకు స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోట కృష్ణ, లింగారావు, బాషా, రఫీ పాల్గొన్నారు.



బస్సును నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు